# మరో నేరానికి దారి

అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టిన సాంబమూర్తి సీటుకు పోయి, తన కుర్చీకి ఎవ్వరూ చూడకుండా గాబరాగా నమస్కరించి, తాపీగా సీటులో కూర్చున్నాడు. ఒక్క క్షణం కళ్లు మూసుకొని ఇష్టదైవాన్ని మనసారా మనసులోనే ధ్యానించుకున్నాడు.

ఈ రోజు లక్ష్మీదేవి ఏయే ఫైల్లు కలపమని ఆజ్ఞ యిస్తుందోనని యెదురు చూడడం మొదలు పెట్టాడు.

సాంబమూర్తి ఒక వర్క్స డిపార్టుమెంటు తాలూకు సర్కిల్ ఆఫీసులో ఆరు సంవత్సరాలుగా అదే ఆఫీసుని అంటిపెట్టుకొని ఒకే సీటుని నమ్ముకొని యు డి సి.గా పనిచేస్తున్నాడు. అతడు ఎస్టాబ్లిష్‌మెంటు బ్రాంచికు హెడ్. అతడికి సాయం చేయడానికి ఒక జూనియర్ ఎల్ డి.సి ని యిచ్చారు. ఆ సర్కిల్‌లో ఏడు డివిజను లుండడం వలన ఎస్టాబ్లిష్‌మెంటు కేసులు ఎక్కువై పోయాయి. అందువల్ల మన సాంబమూర్తికి కష్టమర్లు చాలా ఎక్కువయిపోయారు. కొన్ని కొన్ని సమయాల్లో అతడు రాత్రిపూట కూర్చొనికూడ పని చేయవలసి వస్తుంది.

అతడే పనిచేసినా లక్ష్మీదేవి అనుగ్రహమ్మిదనే సొంత తమ్ముడి ఫైలైనా మణీదేవి కాదంటే మొగమాటం పడకుండా పెండింగ్‌లో పెట్టేస్తాడు కూడ

సాంబమూర్తి ముగ్గురు మగపిల్లలకు తండ్రి. ఆడపిల్ల ఒక్కటి ప్రసాదించమని ఎంతకోరుకున్నా, లక్ష్మీదేవి కరుణించలేదు ఆడపిల్ల కలుగుతే లక్ష్మీదేవని పేరు పెట్టాలని ప్లానుకూడా వేసుకున్నాడు.

మరి నాల్గో ఛాన్సు యివ్వకుండా సంతానోత్పత్తిని మూడుతోనే ముగించేశాడు కాని ఆడపిల్లపై ఆశచావని సాంబమూర్తి, చివరివాడికి జడవేసి, ఆడపిల్లలా, అప్పుడప్పుడలంకరింపించి, ముద్దుచేసి ముచ్చట తీర్చుకుంటాడు.

తను తలబ్రద్దలు కొట్టుకొని ఎంత సంపాదిస్తున్నా, కర్పూరంలా ఖర్చవుతున్న ధనలక్ష్మి వంక కళ్లప్పగించి చూడడం తప్ప యేమీ చేయలేకపోతున్నాడు. కాని సంపాదించినది స్టాక్‌లో వుంచిలేకపోతున్నా, నెలాఖరువరకు ఇబ్బంది లేకుండా గడిచిపోతున్నది. ఖర్చును ఎస్టిమేట్ వేసుకొనే ఓపిక కూడ లేదతడికి.

వస్తున్న డబ్బు ఎందరినుండో తనకు, తన నుండి భార్యకు, ఆమెనుండి తన బావమరిదికి, అతడినుండి పేకాటకు,

గండ్రేటి వెంటయ్య

పాపం ఎత్తునుండి పల్లానికి పారుతున్న నీటిలా జారిపోతున్నదని సాంబమూర్తికి అర్థమయ్యేసరికి ఆలస్యమయిపోయింది. ఐనా ఏమీ చేయలేని అశక్తత, తనది, లేకుంటే మధ్యన యేనాడో గట్టుకట్టి వుండేవాడు. ఇప్పుడు భార్యామణితో పోట్లాడే ధైర్యంగాని, బావమరిదితో గట్టిగా మాట్లాడే స్థైర్యంగాని లేకపోవడమే తన బలహీనత. ఇంత తెస్తున్నా పాపం స్వయంగా సినిమాకు వెళ్ళే స్వాతంత్ర్యం కూడ లేదు. అతదెంత చాతుర్యంతో నాలుగుగు రాళ్ళు ఏరగలుతున్నాడో. అంత గడుసుగా ఆమె లాక్కొంటుంది తన్మయత్వంతో తమ్ముడికి అందిస్తుంది.

సాంబమూర్తి కలాన్ని జేబునుండి తీసి, ఫైళ్ళు అటూ యిటూ తిరిగేయడం మొదలుపెట్టాడు.

ఇంతలో "హల్లో, మూర్తిగారూ, గుడ్ మార్నింగ్" అంటూ ఆరడుగుల ఎత్తులో అందమైన పలువరసతో, ఆనందంతో కూడిన ముఖంతో అడుగు పెట్టాడో యువకుడు. సాంబమూర్తిని సమీపించి కరచాలనం చేశాడు. అంతలోనే మామూళ్ళలుగా "కూర్చోండి" అంటూ ఎదురుగా వున్న కుర్చీని చూపించాడు.

ఆ యువకుడు నవ్వుతూ - "నేనెవరినోనని ఆశ్చర్యపోతున్నారా ?" అనడిగాడు కుర్చీలో కూర్చుంటూ.

"మీ రెవరో నిజంగానే నాకు తెలియదు" అన్నాడు సాంబమూర్తి. 'ఆ నవ్వుముఖాన్నటు తగలెట్టి, వచ్చిన పనేమిటో చెప్పి ఏడవ్వోయ్, ఉత్తుత్తి కబుర్ల కింత ప్రొద్దుటే యేంగాని' అని మనస్సులోనే అనుకుంటూ.

"ప్రొద్దుటే యీ దేభ్యదర్శనమేమిటని విసుక్కుంటున్నారా ?" అన్నా డా యువకుడు పెదవులపై చెరగని చిరునవ్వుతో,

"మీతో మాట్లాడాలంటే భయంగా వుంది సుమండీ" అన్నారు మూర్తి తన మనసులోని విసుగను కప్పిపెడుతూ.

"ఇంతకూ నే నొచ్చిన పనేమిటంటే యీ లిస్ట్ చూడండి ఇది...డివిజనుకు చెందిన ఎస్టాబ్లిష్‌మెంటు కేసులు. ఇవి మీ సీటులో పడివున్నాయి. ఇవన్నీ చేయించుకు రమ్మని వాళ్లంతా నన్ను పంపించారు. నేను ఆ డివిజను క్రింద పనిచేస్తున్న క్రొత్త కాంట్రాక్టరును సుమండీ. ఈ నోరు నేను పనివుండి వచ్చాను. కాని ఆ స్టేఫంతా నా కీ పని తగిలించారు; ప్లీజ్, రేపటిలోగా పూర్తి చేయాలి సుమండీ." అంటూ లిస్ట్ వ్రాసిన కాగితాన్ని అందించాడు.

సాంబమూర్తి ముఖంలో చిరాకు చిగురించింది. కాని బయటకు "ఓహో, అలాగా ?" అంటూ లిస్టందుకొని తన టేబిల్‌పై ఒక ప్రక్కన వుంచాడు చూడకుండానే.

"మరి నన్ను మళ్ళీ వచ్చి రిమైండ్ చెయ్యమంటారా ?" అడిగా డా యువకుడు సాంబమూర్తిని స్టడీచేస్తూ.

"అబ్బే. ఆ శ్రమ మళ్ళీ మీ కెందుకు ? నేను చేసి పంపిస్తాగా వీలైనంత త్వరలో" అన్నాడు తలెత్త కుండానే ! 'ఐనా, అఫ్టరాల్ ఓ కంట్రాక్టరుకు మర్యాదేంటి, నాన్సెన్స్' అనుకున్నాడు లోపల

"మూర్తిగారూ, మీరాపని ఇప్పుడే ప్రారంభించేయండి. నేను పూర్తిగా రెడీ అయ్యే వచ్చాను. మీ సీటు విలువ గుర్తింపు మా కెప్పటికీ వుంటుంది. పని పూర్తయిన వెంటనే...యు డోంట్ వర్రీ" అన్నాడా యువకుడు చెదరని చిరునవ్వుతో మెల్లగా. మూర్తి తలను పైకెత్తాడు ఒక్కసారిగా.

"అబ్బే, అలాంటి దేమీలేదు సుమండీ. ఫ్రాంక్‌గా చెప్పాలంటే, మీకు తెలియని దేముంది ? నాకు ముందున్న క్లర్క్ కూడా కేసుకు నలభై చొప్పున తీసుకునే వాడు. ఇప్పుడు ధరలు విపరీతంగా మండుకుపోతున్నాయి. ఐనా నే నలాంటి వాణ్ణి కాదు సుమండీ. వీళ్ళంతా నాకు కబురు చేశారు తలా ఏభయి చొప్పున పంపుతామని, వెంటనే తమ పనులు పూర్తిచేసి పెట్టమని. నాకు తీసుకొనే వుద్దేశం తక్కువనుకోండి. జేబులో మరీ పోతారు. నా చెల్లెలి పెళ్ళొకటి గుండెమీద రాయయి కూర్చుంది. అందుకు 'ఊ' కొట్టక తప్పడంలేదు" అన్నాడు నెమ్మదిగా సాంబమూర్తి.

"బయటకు ఆ పని తప్పయినా, లోపల రైటే గదండీ. గవర్నమెంటిచ్చేది మనకు రెండు రకాల జీతాలు. ఒకటి లిమిటెడ్ మరొకటి అన్‌లిమిటెడ్. తులిది టేబిల్ మీదుగా గ్రహించవచ్చును. కాని మలిది టేబిల్ క్రింది బిజినెస్. ఇంతకూ, వాళ్ళు అరవై చొప్పున ఎందుకిచ్చారు చెప్మా ?" అని ఆలోచిస్తూ "బహుశా నా ఖర్చులను కూడ కలిపి వుంటారు" అని పూర్తి చేశాడా యువకుడు.

"సరేలెండి. రేపు ప్రొద్దుటనే యీ కేసులన్నీ పూర్తి చేసేస్తాను. వాటి తాలూకు రిప్రెజెన్స్ రేపీవేళకు వచ్చి పట్టుకుపోవచ్చును" అన్నాడు మూర్తి ప్రక్కన పెట్టిన లిస్టును ముందుకు లాక్కుంటూ.

"ఇక మిమ్ములను డిస్టర్బ్‌చేయడం మంచిదికాదు. వస్తాను, రేపు కలుద్దాం" అని లేచి యువకుడు మరోసారి కరచాలనం చేసి బయటకు వెళ్ళిపోయాడు.

సాంబమూర్తి లిస్ట్‌ను చూశాడు. మొత్తం ఇరవై కేసులున్నాయి. నిజంగా ఇన్నాళ్ళకు లక్ష్మీదేవి కటాక్షించి తావెక్కిన ఒంటితో తనను చేరుకొంటు న్నట్టు తలచాడు.

మూణ్ణెల్ల జీతాన్ని ఒక్కరోజులో

సంపాదించగల స్థోమతున్న మగాణ్ణని మీసంపై చెయ్యివేసుకున్నాడు.

నిన్న ప్రావిడెంట్ ఫండ్ అడ్వాన్సు వెయ్యిరూపాయలందుకున్నా, అది తను కూడబెట్టుకున్న డబ్బు కాబట్టి మజా లేకపోయింది. ఈ రోజు పూర్తిచేస్తే తన జేబులో వెయ్యిరూపాయలు దూరతాయి.

ఇలా అనుకుంటూ ఆ కేసులకు సంబంధించిన ఫైళ్లు వెదకటం ప్రారంభించాడు. వాటిలో కొన్ని ట్రాన్స్‌ఫర్ గురించి పెద్దాఫీసుకు పంపవలసిన దరఖాస్తులు ఉన్నాయి. వాటిని ఎంచి చకచక డ్రాఫ్టులు వ్రాసి సంతకానికి పంపించాడు. మరికొన్ని ఇ.బి కేసులు ఛీఫ్ ఇంజనీర్‌కు పంపవలసినవికూడ డ్రాఫ్టులు వ్రాసి పంపించేశాడు. కొన్ని లీవ్ కేసులు, మరికొన్ని ప్రావిడెంట్ ఫండ్ అడ్వాన్సు కేసులు వున్నాయి. అసిస్టెంట్ సహాయంతో అన్ని పనులు మూడుగంటలకు ముందే పూర్తిచేసి, సాయంత్రం సంతకాలు పెట్టిపించి, టైపు తరవాత మళ్ళీ సంతకాలు, డిస్పాచ్ కూడా చేయించేశాడు. అందరూ ఆఫీసు వదిలిపోయిన తరువాత, ఇష్యూ రిజిస్టర్ నుండి రిఫరెన్స్ అఫ్ డిస్పాచ్ నోట్‌చేసి తీసుకున్నాడు.

ఆ రాత్రి ఆనందంగా నిద్ర పోయాడు సాంబమూర్తి. నిద్రపోయే వరకు భార్యతో యేవో ఆలోచనలు జరుపుతూనే వున్నాడు. అప్పుడప్పుడందే డబ్బు ఎలా ఖర్చయినా, ఒక్కసారి దొరికే యీ మొత్తాన్ని సవ్యంగా వినియోగించుకోవాలనుకున్నాడు

తెల్లవారింది. సాంబమూర్తి చక చక పనులు చక్కబెట్టుకొని, వేడి వేడి మెతుకులు తొందరగా దిగమింగి తొమ్మిదిన్నరకే ఆఫీసుకు చేరుకున్నాడు.

కాలుకాలిన పిల్లిలా అటు యిటు తిరుగుతు యువకుడి రాకకోసం కాచుకూర్చున్నాడు. జేబులోని తను నోట్‌చేసుకున్న రిఫరెన్స్‌ల జాబితాను తడిమి చూసుకున్నాడు.

యువకుడు వచ్చాడు. సాంబమూర్తి నవ్వుతూ అతణ్ణి తన గదిలోనికి సాదరంగా ఆహ్వానించాడు.

ఇద్దరూ కూర్చున్నారు.

సాంబమూర్తి టీకి ఆర్డరు పంపించాడు.

టీకుర్రాడు టీ తీసుకురాబోయేసరికి, ఆఫీసులోని మిగతా స్టాఫంతా సాంబమూర్తిని చుట్టుముట్టారు ఆ ఆఫీసు అలవాటు అంతే మరి పాపం రెండు కప్పుల టీతో సరిపెట్టుకోవాలనుకున్న సాంబమూర్తి, ఆఫీసంతటికీ పార్టీ యివ్వవలసి వచ్చింది. ఐనా సాంబమూర్తి సంకోచించలేదు. రానున్న వెయ్యిలో పదిపదిహేను ఖర్చయితే నష్టమేముందనుకున్నాడు.

కులాసా కబుర్లతో తేనీరు త్రాగారంతా.

ఎవరి సీటులో వాళ్ళు కూర్చొని పనులు చేసుకుంటూ వుండగానే, సంభాషణలు మొదలుపెట్టడానికి సమయం చిక్కింది మన మూర్తికి

జేబునుండి కాగితాన్ని తీసి అతడికి అందించాడు.

కాగితాన్ని తీసుకుంటూ అతడు "థేంక్స్" అన్నాడు. సాంబమూర్తికి చిన్న నేమ్‌కార్డును ఇస్తూ, "సాయంత్రం ఐదునర్నకు ఈ అడ్రసుకు వచ్చేయండి మనం లెఖలు చూసుకుందాం" అన్నాడు.

అదే సమయంలో పి.ఎ. గారు పిలుస్తున్నారని బంట్రోతు వచ్చి చెప్పడంతో, అతడిచ్చిన అడ్రసు కార్డును జేబులో కుక్కి లేచి నిలబడ్డాడు మూర్తి.

ఆ యువకుడు కూడా లేస్తూ మళ్ళీ అన్నాడు "తప్పకుండా వస్తారు సుమా. లేకుంటే మీ యిల్లు వెదుక్కుంటూ నేనే రావలసి వుంటుంది."

"అబ్బే, మీకంత శ్రమెందుకిస్తా నండీ" అంటూ పి ఎ చాంబర్ వైపు నడక సాగించాడు మూర్తి యువకుడు బయటకు నడిచాడు.

ఆఫీసు గడియారం ఐదుగంటలు కొట్టింది.

సాంబమూర్తి ఆఫీసుకు సలామ్ కొట్టి యింటికి చేరుకున్నాడు.

ఎన్నడూ లేనిది, ఆరోజు యిల్లాలు యింటిలోనే వుండి ముస్తాబయి, టీ కప్పును నవ్వుముఖంతో అందించింది కూడ. ఆ నవ్వును చూసిన సాంబమూర్తికి ఆ క్షణం స్వర్గలోకంలో విహరించినట్టయింది.

ఇంట గృహలక్ష్మి బయట ధనలక్ష్మి తనను ఎకబిగిని ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నారు.

ఉన్న వెయ్యి, రాబోయే వెయ్యి పెట్టి, భార్యకేదయనా బంగారు ఆభరణాలు చేయిస్తే బాగుంటుం దనుకున్నాడు.

మూడు నిముషాల్లో ముస్తాబై పోయాడు

తను వెళ్ళవలసిన వీధి ఎటుప్రక్కో చూద్దామని జేబునుండి నేమ్ కార్డ్‌ను తీసి చూసుకున్నాడు.

అంతే...

సాంబమూర్తిలో చలనం ఆగిపోయిం దొక క్షణం

కార్డుమీది అక్షరాలు నవ్వుతూ తనను వెక్కిరించాయి.

సాంబమూర్తి వాటిని ఏడుస్తూ వెక్కిరించాడు.

మరోసారి జాగ్రత్తగా చదువుకున్నాడు.

"ఉదయ్ కుమార్. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్, ఇంటినంబరు...వీధి..." అని వుంది

ఆ యువకుడు విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌వాడా? అతడితోనా తనింత

సేపూ డీల్ చేసింది. 'నవ్వుతూ నన్ను నట్టేట్లో ముంచేశాడు.' అనుకున్నాడు.

సాంబమూర్తికి ఆశ్చర్యంతో పాటు ఒళ్ళంతా చెమటపట్టింది.

ఇక నా ఉద్యోగానికి ఎసరుపెట్టడం ఖాయం' అని వాపోయాడు.

వాచీ ఐదు ఇరవయి చూపించింది.

తనిప్పుడు వెళ్ళటమా మానటమా? ఏమీ తేల్చుకోలేకపోయాడు అతడు డబ్బు ఇస్తాడన్న ఆశ అదెప్పుడో చచ్చిపోయింది.

తన నతడంత తేలిగ్గా విడిచిపెట్టడన్న నమ్మకము మొలకెత్తింది.

అతడి ప్రవర్తన మొదటినుండి చివరివరకు కళ్ళముందు కదిలింది. అతడి మాటలు మళ్ళీ మళ్ళీ గుర్తొచ్చాయి.

'తప్పకుండా వస్తారు సుమా! లేకుంటే మీ యిల్లు వెదుక్కుంటూ నేనే రావలసివుంటుంది" అతడి చివరి మాటలు చెవుల్లో క్రింగ్ మన్నాయి.

"సాయంత్రం ఐదున్నరకు ఈ అడ్రసుకు వచ్చేసేయండి మనం లెఖ్ఖలు చూసుకుందాం" అంతకు ముందుమాట గదంతా మార్మోగింది.

వాచీ చూసుకున్నాడు. ఐదు యిరవయ్యయిదు.

ప్రొద్దుట పేచీ పెట్టిపోయాడు. ఇప్పుడు ప్రాణాలు తోడేస్తున్నాడు. తరువాత ఉద్యోగం 'ఊడపీకిచ్చేస్తాడు' అనుకుంటూ మూర్తి జుత్తు పీకేసుకున్నాడు.

అతడి చివరి మాటల్లో ఏదో అర్థం స్ఫురించింది మూర్తికి

లంచాలు తినితిని పెరిగిన ఒంటితో పాటు లంచగొండిదయిన తన మనస్సు కూడ ప్రపంచమంతా లంచాలపైనే నడుస్తున్నదని హెచ్చరించింది. ఆలస్యమైతే ఆపద ముంచుకొస్తుందని తొందర చేసింది.

ఇక ఆలోచించడం అనవసరమని పెట్టి తీశాడు.

చేతులు రాకపోయినా చేసేదిలేక, తను ముందురోజు తీసుకున్న ప్రావిడెంట్ ఫండ్ అడ్వాన్సు డబ్బును జాగ్రత్తగా జేబులో పెట్టుకొని, పిలుస్తున్న పెళ్లాన్ని కూడ కళ్ళెత్తి చూడకుండా, ఏడుపు ముఖంతో యిల్లు విడిచాడు సాంబమూర్తి, అడ్రసు కార్డును మరోసారి చదువుకుంటూ.

సమస్యలన్నిటినీ 'సమ్ థింగ్'తో సాల్వ్ చేయొచ్చుననే మనస్తత్వాన్ని నిరూపించుకున్న సాంబమూర్తికి, తను చెయ్యబోయే పని మరో నేరానికి దారి తీయొచ్చుననే ఆలోచన రానేలేదు.

— — —